క్లుప్తంగా

బాలికలకు డ్రాయింగ్ పోటీలు



జంపని(వేమూరు): విద్యార్థినులు, విద్యతో పాటు పెయింటింగ్ కూడా నేర్చుకోవాలని సీఐ శ్రీమన్నారాయణ తెలిపారు. వేమూరు మండలంలోని జంపని గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం వారోత్సవాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి విద్యార్థినులకు అనేక పోటీలు నిర్వహించడం జరిగిందని, విజేతలకు మహిళ దినోత్సవరం రోజు బహుమతులు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవికృష్ణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి



అమర్తలూరు(వేమూరు): ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ఏపీడీవో సువార్తమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పథకం కూలీలకు పనులు కల్పించాలని ఆమె సూచించారు. మార్చి నెలలో గ్రామంలోని అన్ని గ్రూపులకు పనులు కల్పించాలన్నారు. పనులు లేకపోతే కొత్త పనులు గుర్తించి అంచనా వేయాలని తెలిపారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కూలీలందరికీ పనులు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఉందని ఆమె చెప్పారు. పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.మారుతి శేషమాంబ, లక్ష్మీ, ఫీల్డ్ అసిసెంట్‌లు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలతో సమన్వయం సాధ్యం



గ్రామ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు: ప్రజా సమస్యలపై పోరాటం చేయడంతోపాటు, పార్టీలో సమన్వయం సాధించడానికి గ్రామ కమిటీలతోనే సాధ్యపడుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని పోతార్లంక, తోకలవారిపాలెం, తిప్పలకట్ట, కిష్కిందపాలెం, తడికలపూడి గ్రామాలలో నూతన గ్రామ కమిటీల నియామక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను వంచిస్తూ చేపడుతున్న అరాచక పాలనపై పోరాటాలు చేయడానికి వైఎస్సార్‌సీపీ ముందంజలో ఉంటుందన్నారు. గ్రామ కమిటీల ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతోపాటు, ప్రభుత్వ వైఫల్యాలను సమర్ధవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి సాధ్యపడుతుందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడే వ్యక్తి అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎన్నికల సమయంలో ఇచ్చిన సంక్షేమ పథకాల హామీలను విస్మరించి ప్రజలను మభ్యపెడుతూ కాలం వెళ్లబుచ్చుతుందన్నారు. సంక్షేమ పథకాలు వస్తాయని ఆశించిన పేద వర్గాలు ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ అప్పుల పాలవడం బాధాకరమన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలకు తోడు, ప్రకటించని పథకాలను సైతం అమలు చేసి రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి వర్తింపజేసి ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కించారన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. నేడు కూటమి ప్రభుత్వం పథకాలను అమలు చేయని కారణంగా మైక్రో ఫైనాన్స్ సంస్థల ఉచ్చులో చిక్కుకొని పేద వర్గాలు సతమతమవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఐదు గ్రామాలలో నూతన గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుగ్గున మల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు బుల్లా నవరత్నం, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, నాయకులు గుర్రం వీరరాఘవయ్య, దివి వెంకటేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



మాట్లాడుతున్న కమిషనర్ సాంబశివరావు

రేపల్లె రూరల్: పర్యావరణ పరిరక్షణ నిమిత్తం ప్లాస్టిక్ నివారణకు వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు కోరారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నివారణకు పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం పట్టణంలోని వివిధ హోటళ్లు, కిరాణా, హోల్‌సేల్ కవర్ల దుకాణాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హోటళ్ల యజమానులు కవర్ల వినియోగాన్ని నివారించి వాటి స్థానంలో ప్రత్యామ్నాయం చూసుకోవాలన్నారు. కిరాణా షాపుల నుంచి వినియోగదారులకు క్యారీ బ్యాగ్‌లలో వస్తువులను ఇవ్వటం నిషేధించాలన్నారు. క్యారీ బాగ్‌ల స్థానంలో గుడ్డ సంచులు, గన్నీ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు త్వరలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి వినియోగదారులు, విక్రయదారులు, వ్యాపారులకు అపరాధ రుసుము విధించటంతో పాటు తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలు సైతం పాలిథిన్‌ను నిర్మూలించేందుకు తమ సహకారాన్ని అందించాలని, ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించి పర్యావరణ హితులుగా మారాలని కోరారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, సెక్రటరీలు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఆప్కాస్ కొనసాగించాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

బాపట్ల: ఆప్కాస్ విధానం కొనసాగించాలంటూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు బాపట్ల జిల్లా విభాగం, ఏఐటీయూసీ సంయుక్తంగా కలెక్టరేట్ వద్ద ఈ కార్యక్రమం చేపట్టాయి. కలెక్టర్‌ను కలిసి అర్జీ ఇచ్చేందుకు వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కలెక్టరేట్ దారిలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ.. ఆప్కాస్ రద్దు నిర్ణయం వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో పారిశుద్ధ్య కార్మికులకు మేలు జరిగే అంశాలను అమలు చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు వాటినే కొనసాగించాలన్నారు. పేర్లు మార్చినా ప్రయోజనాలు అదేస్థాయిలో ఇవ్వాలని కార్మికులు కోరుతున్నారని పేర్కొన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి దాసు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 40 వేల మంది ఆప్కాస్ కార్మికులుగా పనిచేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను తొలగించాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 2014 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వమే 279 అనే జీవోని పెట్టి జీతాలు సక్రమంగా ఇవ్వలేదన్నారు. ఆప్కాస్ వలన కార్మికులకు సక్రమంగా జీతాలు అందుతున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ.. కార్మికులపై ప్రభుత్వం కక్ష సాధించటం సరైన విధానం కాదన్నారు. ఆప్కాస్ విధానం రద్దు చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.సుబ్బారావు, కార్యదర్శి డొక్కా మాల్యాద్రి, చీరాల అధ్యక్షులు డి. నాగేశ్వరరావు, సెక్రటరీ పి.కామాక్షి, సత్యవతి, వెంకటలక్ష్మి, ఈశ్వరమ్మ, కుమారి, దుర్గ, విజయలక్ష్మి, బాబురావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

రేపల్లె రూరల్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకని బాపట్ల జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శోభారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తగరతులు 90 రోజుల పాటు నిర్వహించబడునన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన బీసీ, ఈడబ్ల్యూఎస్, ఈబీసీలకు సంబంధించిన రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ సామాజిక వర్గాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ అందించబడునన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు తమ పరిధిలోని సచివాలయాలలో 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

సర్పంచులకు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న జి.వి.శ్రీదేవి

బాపట్ల: మహిళా, బాలికల స్నేహపూర్వక పంచాయతీల ఏర్పాటుకు అందరు కృషి చేయాలని పంచాయతీ రాజ్ సంస్థ జాయింట్ డైరెక్టర్ జి.వి. శ్రీదేవి పేర్కొన్నారు. విస్తర్ల శిక్షణ కేంద్రంలో రెండు రోజులు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. జి.వి.శ్రీదేవి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శ మహిళా, బాలికల స్నేహపూర్వక గ్రామ పంచాయతీలను గుర్తించామన్నారు. 26 జిల్లాల్లోని 26 గ్రామ పంచాయతీల మహిళా సర్పంచులు, కార్యదర్శులు భాగస్వాములుగా ఈ శిక్షణ నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామ పంచాయతీలు లింగ ఆధారిత హింసను పరిష్కరించాలని, లింగ నిర్ధారణను నిరోధించడం, బాల్య వివాహాల నిర్మూలన, మహిళా గ్రామ సభ నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.వెంకట్రావు, జాయింట్ డైరెక్టర్ ఆర్.కేశవరెడ్డి , డిప్యూటీ డైరెక్టర్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికను అత్యాచారం చేయడం దారుణం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



బాలిక కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్ గణేష్, నాయకులు

నగరం: అత్యాచారానికి గురైన మైనర్ బాలిక కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ చెప్పారు. యాదవపాలెంలో ఇటీవల అత్యాచారానికి గురైన మైనర్ బాలిక కుటుంబాన్ని బుధవారం డాక్టర్ గణేష్ పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ బాలికలు, మహిళలపై రోజురోజుకి అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. మైనర్ బాలికను అత్యాచారం చేయడం దారుణమన్నారు. అత్యాచారానికి పాల్పడిన నిందితుణ్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం బాలిక కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఇంకోల్లు రామకృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.కోటేశ్వరరావు, నియోజకవర్గ బీసీ సెల్, యువత అధ్యక్షులు పాగోలు వెంకటేశ్వరరావు, డి.కొండలరెడ్డి, నాయకులు బాలకృష్ణ, పృథ్వీరాజ్, ప్రసాద్, మరకా నాగేశ్వరరావు, మరకా సాయిబాబు, వరప్రసాద్, సుకుమార్, శ్రీనివాసరావు, సురేష్ పాల్గొన్నారు.

బాధితులకు డాక్టర్ గణేష్ పరామర్శ



ఈదులమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ గణేష్

నిజాంపట్నం: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. ఇటీవల రహదారి ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న పల్లపట్ల గ్రామానికి చెందిన ఓగిబోయిన గోపీచంద్, వై.రామకృష్ణలను బుధవారం సాయంత్రం పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న గంగుల ఈదులమ్మను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రేపల్లె పట్టణ, నిజాంపట్నం మండల అధ్యక్షులు కరేటి శేషగిరి, యార్లగడ్డ రాంబాబు, నాయకులు జోసఫ్, పూర్ణచంద్రరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

సీడీపీవో సుచరిత



రేపల్లె రూరల్: చిన్నారుల ఆరోగ్యం పట్ల అంగన్‌వాడీలతో పాటు తల్లిదండ్రులు సైతం ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీడీపీవో ఎం.సుచరిత చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని బాపూజీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న మూడు అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను బుధవారం తల్లిదండ్రులకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందించబడుతుందన్నారు. అంగన్‌వాడీలు విద్యను అందించటమే కాకుండా చిన్నారుల ఎత్తు, బరువులను పరిశీలించి వారికి అందుతున్న పోషణ స్థాయిని పర్యవేక్షిస్తుండాలన్నారు. ఆయా వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు భవానీ, రమాదేవి, ప్రమీల, తల్లిదండ్రులు తదితరులున్నారు.

భట్టిప్రోలులోనే తెలుగు లిపికి శ్రీకారం

భట్టిప్రోలు (కొల్లూరు) : తెలుగు లిపి భట్టిప్రోలులోనే పురుడు పోసుకుందని బాపట్లకు చెందిన ఫోరం ఫర్ బెటర్ సంస్థ సభ్యులు అన్నారు. బుధవారం భట్టిప్రోలులోని బౌద్ధ స్తూపం ప్రాంగణంలో భట్టిప్రోలు లిపికి సంబంధించిన కరపత్రాన్ని విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణితో కలిసి ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, డాక్టర్ బహుగుణ పార్థసారథిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భట్టిప్రోలు లిపే తెలుగు లిపికి మాతృక అన్నారు. భట్టిప్రోలు శాసనం తెలుగు లిపికి సంబంధించిన అతి ముఖ్యమైన ఆధారం అని పేర్కొన్నారు. భట్టిప్రోలు లిపి కాలక్రమంలో కాదంబరి లిపిగా పరిణామం చెంది, అనేక దశల అనంతరం క్రీ.శ. ఐదవ శతాబ్దం నాటికి తెలుగు లిపిగా పరిణామం చెందిందన్నారు. వాస్తవానికి దక్షిణ భారతదేశపు లిపులన్నీ భట్టిప్రోలు లిపి నుంచే పరిణామం చెందాయని తెలిపారు. చిత్రకారుడు జీవీ చక్రవర్తి పాల్గొన్నారు.


నేడు మద్యం షాపు టెండర్లకు లాటరీ

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్ ప్రసాద్

నగరం: రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపులకు సంబంధించి కల్లు గీత కులాలకు 10 శాతం రిజర్వేషన్ కింద కేటాయించిన షాపుల టెండర్లకు గురువారం లాటరీ తీయనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్ చెప్పారు. బుధవారం విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మండలంలోని గౌడ కులస్తులకు మద్యం షాప్ కేటాయించినట్లు తెలిపారు. మద్యం షాపుకు ఆరు టెండర్లు వచ్చాయన్నారు. టెండర్ల ఎంపిక 6వ తేదీన బాపట్ల కలెక్టరేట్‌లోని పీజీఆర్ హాల్‌లో లాటరీ తీయనున్నట్లు పేర్కొన్నారు. టెండర్లు వేసిన వారు తప్పక హాజరుకావాలని కోరారు.

భట్టిప్రోలు (కొల్లూరు) : గీత కార్మిక కులాలకు ప్రభుత్వం కేటాయించిన మద్యం దుకాణాల కేటాయింపుకు గురువారం డ్రా తీయనున్నట్లు రేపల్లె ఎక్సైజ్ సీఐ దివాకర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాపట్ల కలక్టరేట్‌లోని పీజీఆర్ హాల్‌లో జిల్లా కలెక్టర్ డ్రా తీయనున్నారన్నారు. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న అభ్యర్థులు గురువారం ఉదయం 8 గంటలకు డ్రా కార్యక్రమానికి హాజరుకావాలని ఎక్సైజ్ సీఐ కోరారు.

రైతులు గుర్తింపు సంఖ్య పొందాలి



కర్లపాలెం: రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించి గుర్తింపు సంఖ్య పొందాలని ఏవో సుమంత్‌కుమార్ చెప్పారు. బుధవారం మండలంలోని యాజలి, దుండివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ రబీ సాగులో పంట నమోదుకు సంబంధించిన ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కొరకు ఈ నెల 6వ తేదీ నుంచి రైతు సేవా కేంద్రాల్లో ఉంచుతామని తెలిపారు. రైతులు జాబితాను పరిశీలించి సవరణలు ఏమైనా ఉంటే 17వ తేదీ లోపు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని చెప్పారు. చిన్న, సన్నకారు రైతులు ప్రభుత్వ సబ్సిడీలను వినియోగించుకోవాలని సూచించారు. ఏఈవో భాగ్యలక్ష్మి, వ్యవసాయ సహాయకులు సునీత, గోపి తదితరులు ఉన్నారు.

ఆగున్న వాహనాన్ని ఢీ కొని ఆటో డ్రైవర్‌కు గాయాలు



కొల్లూరు : ఆగి ఉన్న వాహనాన్ని ఢీ కొని ఆటో డ్రైవర్ తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని రావికంపాడు అడ్డరోడ్డు వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మొసలిపాడుకు చెందిన క్రాంతికుమార్ తన ఆటోలో బుధవారం కొల్లూరు నుంచి ఓ వృద్ధురాలిని తెనాలి వైద్యశాలకు తీసుకువెళుతున్నాడు. రెండు రోజులుగా మరమ్మతులకు గురైన ట్రాలీ ఆటోను రావికంపాడు అడ్డరోడ్డు వద్ద నిలిపి ఉంచారు. ఆగి ఉన్న వాహనాన్ని ఆటో డ్రైవర్ వెనుక నుంచి బలంగా ఢీ కొనడంతో ఆటోలో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలకు గురయ్యాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు అతికష్టం మీద క్రాంతికుమార్‌ను బయటకు తీసి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో వృద్ధురాలికి స్వల్పగాయాలయ్యాయి.

ఉపాధి హామీ పనులు పరిశీలన



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి

నిజాంపట్నం: నిర్దేశించిన పనులను సక్రమంగా పూర్తి చేయాలని ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి ఉపాధి హామీ కూలీలకు సూచించారు. మండలంలోని గరువుపాలెం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను బుధవారం ఆమె పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ పథకం ద్వారా గ్రామాలలోనే కూలీలకు ఉపాధి లభిస్తుందన్నారు. నిర్దేశించిన పనులను సకాలంలో సక్రమంగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం వేసవి కాలం నేపథ్యంలో పని ప్రదేశాలలో ప్రథమ చికిత్స కిట్లతో పాటు తాగునీటిని కూలీలకు అందుబాటులో ఉంచాలని మేట్లు, ఫీల్డు అసిస్టెంట్‌లకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు మెరుగైన రంగాలను ఎంచుకోవాలి



మాట్లాడుతున్న డి.చక్రపాణి

భట్టిప్రోలు (కొల్లూరు) : విద్యారంగంలో అందుబాటులో ఉన్న కోర్సులను ఎంచుకోవడం కంటే విద్యార్థులు మెరుగైన అవకాశాలు ఏ రంగంలో ఉన్నాయో తెలుసుకొని ఎంచుకోవడం వల్ల వారి భవిష్యత్తు బృహత్తరంగా ఉంటుందని విశ్రాంత ఐఏఎస్ డి.చక్రపాణి అన్నారు. బుధవారం స్థానిక విశ్వశాంతి పాఠశాలకు విచ్చేసిన ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు జ్ఞానాన్ని అందించే ముందు తగిన జ్ఞానాన్ని ఉపాధ్యాయులుగా ఏ విధంగా సాధించాలన్న అంశాలను సవివరంగా తెలియజేశారు. విద్యార్థులకు ప్రతి రోజు న్యూస్ పేపర్ చదవడం అలవాటు చేయడం ద్వారా పాఠ్య పుస్తకాల్లోని విజ్ఞానంతో పాటు సామాజిక అంశాలకు సంబంధించిన విజ్ఞానం మెరుగు పడుతుందని సూచించారు. పదో తరగతి అనంతరం ఏఏ రంగాల్లో మంచి అవకాశాలున్నాయో ఉపాధ్యాయులు దిశా నిర్దేశం చేయాలన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి నిలిపి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో బహుగుణ సారధి, పాఠశాల కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, హెచ్ఎం ఫణి, శ్రీధర్, డీఆర్‌పీసీ సాయిబాబు, విశ్రాంత రీడర్ ఇన్ కామర్స్ జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీస్తు శిలువ శ్రమానుభవ ధ్యానములు

భట్టిప్రోలు: క్రీస్తు ప్రభుని శిలువ శ్రమానుభవ ధ్యానములు గురువారం నుంచి ఏప్రిల్ 19వ తేదీ వరకు ప్రతి రోజు రాత్రి 7:30 గంటలకు జరుగుతాయని గురు మండల అధ్యక్షుడు, తూర్పు గుంటూరు సినడ్ డిప్యూటీ బిషప్ రెవరెండ్ రవీంద్ర వర్మ దాసరి బుధవారం తెలిపారు. లూథరన్ సంఘం, డెలిగేట్, పీసీసీ సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, యూత్ చిల్డ్రన్ భట్టిప్రోలులో నిర్వహిస్తారని పేర్కొన్నారు. 40 శ్రమ దినములు ఆరాధనలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఏసు శిలువలో పలికిన 7 మాటలు సంఘ పెద్దలు స్త్రీల సమాజం, అంబేడ్కర్ యూత్, సండే స్కూల్, సంఘస్తుల సౌజన్యంతో ప్రత్యేకంగా సాయంత్రం 6 నుంచి రాత్రి 8:30 గంటల వరకు ఏర్పాటు చేస్తారని వివరించారు.

రేపు వెల్లటూరులో 17వ వార్షికోత్సవం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరులోని లాక్ సెంటర్‌లో కొలువైన కనకదుర్గ మహంకాళి, నాగేంద్రస్వామి దేవాలయం 17వ వార్షికోత్సవం శుక్రవారం జరుగుతుందని నిర్వాహకులు జొన్నా సుబ్బారావు భవాని బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం దేవాలయంలో గణపతి పూజ, అభిషేకములు, కుంకుమ పూజ, సత్యన్నారాయణ వ్రతం జరగనున్నట్లు పేర్కొన్నారు. కోనేటిపురం నాగమల్లేశ్వరరావు బృందంచే భజన జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు.